


పచ్చని తెలంగాణే లక్ష్యం
ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి
తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
కాశీంపూర్‌లో ఎక్సైజ్, అటవీశాఖల ఆధ్వర్యంలో వనమహోత్సవం 6

అందరికీ సంక్షేమం



ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. విస్తీర్ణం కంటే జనాభా ఎక్కువగా ఉన్న మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కలెక్టరుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఆయన మాటల్లోనే..

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం
సీఎస్ఆర్ నిధులతో స్కూళ్ల అభివృద్ధి
భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి
ఎలివేటెడ్ కారిడార్ పనుల వేగవంతానికి చర్యలు
మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి
'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా ముచ్చట్లు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మేడ్చల్, జూలై 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రూరల్ జిల్లాలతో పోల్చుకుంటే ఈ జిల్లాలో జనాభా ఎక్కువ. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు అధిక సంఖ్యలో ఉన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. జిల్లాలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పెరుగుతున్న జనాభాకనుగుణంగా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. నేను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో

మిగతా 8వ పేజీలో...

నాలా కన్వర్షన్ చేసిన తర్వాతే..

జిల్లాలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. 455, 456, 747 జీవోల ప్రకారం దాదాపు 1,500 మంది డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. 455, 456 జీవోలు 2002లో వెలువడ్డాయి. వీటి ప్రకారం జిల్లాలో 481 దరఖాస్తులు, అలాగే 747 జీవో ప్రకారం 1,176 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై ప్రజావాణిలో కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. వీటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. భూ భారతిలో రిజిస్ట్రేషన్‌లపై తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నాలా కన్వర్షన్ చేయకుండా ఫామ్ ల్యాండ్‌ల రిజిస్ట్రేషన్ చేయొద్దని ఆదేశించాం. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలపై మళ్లీ దరఖాస్తులు వస్తున్నాయి. కొన్నింటికి ప్రొసీడింగ్స్ కూడా లేవు. రికార్డులు సరిగా లేని అన్నింటిని గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తాం.

పనులు త్వరగా పూర్తయ్యేలా..

ఇటీవల జిల్లాలో వెలుగు చూసిన రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై అదనపు కలెక్టర్ నేతృత్వంలో విచారణ పారదర్శకంగా సాగుతోంది. ఈ వ్యవహారంలో ఎంత మంది ఉన్నా.. ఎంతటి వారు ఉన్నా అందరిపై చర్యలు తీసుకుంటాం. నివేదిక రాగానే చర్యలు చేపడుతాం. జేబీఎస్ నుంచి దొంగలమైసమ్మ రింగ్ రోడ్డు సర్కిల్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను వేగవంతమయ్యేలా చర్యలు చేపడతా. భూ సేకరణపై సమస్యలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని పరిష్కరించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటా. బాధితులకు నష్టపరిహారం అందించి పనులు త్వరగా జరిగేలా చూస్తాం.

గోపన్‌పల్లిలో డెంగీ కేసు

తాండూరు రూరల్, జూలై 16, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గౌతాపూర్ పంచాయతీ అనుబంధ గ్రామమైన గోపన్‌పల్లిలో ఓ విద్యార్థికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు సమాచారం రావడంతో వైద్యాధికారులు పర్యటించారు. ఆస్పత్రి సబ్ యూనిట్ అధికారి ప్రకాశ్ జినుగుర్తి పీహెచ్‌సీ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, ఎల్‌టీ సత్యనారాయణ, ఏఎన్ఎం బుధవారం గోపన్‌పల్లిలో బాధిత విద్యార్థిని పరిశీలించారు. అయితే ఆ విద్యార్థి అబుబకర్.. తాండూరులో 9వ తరగతి చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు విద్యార్థి రక్తనమూనా సేకరించి, డెంగీ సోకిన విషయం వాస్తవమేనని వెల్లడించారు. అయితే విద్యార్థి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గిరిజన రైతు మృతి



బషీరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ క్షేత్రంలో రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం కాశీంపూర్ తండాలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ పి.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నార్యానాయక్(60) సాయంత్రం వేళ గ్రామ సమీపంలోని తన పొలానికి వెళ్లాడు. నారుమడికి నీరు వేసేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే అక్కడ తెగి పడినా బోరు మోటార్ సర్వీస్ వైరుకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న కుటింబీకులు హుటాహుటిన తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటింబీకులు తెలిపారు. మృతుడి కుటింబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండె చెరువు!

వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ భారీ వానలు కరువయ్యాయి. దీంతో జలకళను సంతరించుకోవాల్సిన చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మత్స్యరంగంపై ఆధారపడిన వారు ఆందోళన చెందుతున్నారు. లోటు వర్షపాతంతో చేపల పంపిణీపై సందిగ్ధం ఏర్పడింది. నేటికీ టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదును దాటుతున్నా చెరువుల్లో చేప పిల్లలను వదలకపోవడం, వాటి ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరులేక చెరువులు, కుంటలు వెలవెల



నీరు లేక వెలవెలబోతున్న కులకచర్ల మండలం కామునిపల్లి చెరువు

ముఖం చాటేసిన వరుణుడు
సందిగ్ధంలో చేప పిల్లల పంపిణీ
ఆందోళనలో మత్స్యకారులు
లక్ష్యం 1,29,72,000 చేపపిల్లల విడుదల
వికారాబాద్ జిల్లాలో 778 చెరువులు, కుంటలు
మేడ్చల్ జిల్లాలో 333



కులకచర్ల /మేడ్చల్, జూలై 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వర్షాభావ పరిస్థితుల కారణంగా మత్స్య పారిశ్రామిక రంగం కుదేలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈసారి చేప పిల్లల పంపిణీ ఉంటుందా? ఉండదా? అనే అయోమయంలో మత్స్యకారులు ఉన్నారు. వికారాబాద్ జిల్లాలో మొత్తం కుంటలు, చెరువులు 778 ఉండగా మత్స్య సహకార సంఘాలు 151 ఉన్నాయి. అందులో 5,600 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీపై ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు రాగానే బొచ్చె, రవట, బంగారు తీగ, మోసు రకాలకు చెందిన 1,29,72,000 చేప పిల్లలను చెరువుల్లో వదలాలని జిల్లా మత్స్యశాఖ అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. కాగా, ప్రభుత్వం ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీపై ఊసెత్తకపోవడంతో మత్స్యకారులు ఆయోమయానికి గురవుతున్నారు.

ఆలస్యమైతే కష్టమే..

కిలో సైజు చేప పెరగాలంటే ఆరు నెలల సమయం పడుతుంది. జూన్, జూలై నెలలో పిల్లలు వదిలితే డిసెంబర్ నుంచి వేటకు అనుకూలంగా ఉంటుంది. ఇంకా సమయం ఉంటే ఓ నాలుగు నెలలపాటు పట్టుకునేందుకు

మిగతా 8వ పేజీలో...

చేపపిల్లల పంపిణీ చేపట్టాలి



గతంలో మాదిరిగా ప్రభుత్వం వెంటనే చేపపిల్లలు పంపిణీ చేయాలి. వర్షాభావ పరిస్థితుల కారణంగా పెద్ద వానలు కురవలేదు. దీంతో మత్స్యకారులకు ఇబ్బందులు తప్పేలా లేవు. చెరువులు వేలం వేస్తున్నా ఆశించిన లాభాలు రావడం లేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి.

-కే.అంజిలయ్య ముదిరాజ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, కులకచర్ల

చేపపిల్లలకు బదులు నగదు ఇవ్వాలి



మేము మూసీ పరీవాహక ప్రాంత మత్స్యకారులం. ఈ ప్రాంతం చెరువుల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన చిన్న చేపపిల్లలు వేస్తే కాలుష్యానికి మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో చేపపిల్లలకు బదులుగా డబ్బులు ఇస్తే పెద్ద సీడ్ తెచ్చుకుని పెంచుకుంటాం.

-మెట్టు రమేశ్, మత్స్యకారుడు, ఎదులాబాద్(ఘట్‌కేసర్)



దోమ కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి


- విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా బోధించాలి
- ఉపాధ్యాయులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచన

కులకచర్ల/దోమ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఉపాధ్యాయులు.. విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. బుధవారం కులకచర్ల, దోమ కేజీబీవీ, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల వసుతులను పరిశీలించి గిరిజన బాలుర పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. తరగతి గదుల్లో అదనంగా ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని వార్డెన్ సుందర్‌రాజుకు సూచించారు. కేజీబీవీలో వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించి బాలికలతో మాట్లాడారు. గణితం, ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయులు లేరని బాలికలు చెప్పడంతో వెంటనే నియమిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో హబీబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

అధికారుల పనితీరుపై ఆగ్రహం

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. దోమ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో ఆయన కలిసి భోజనం చేశారు. అనంతరం ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కాగా, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి గీత పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయి అధికారులు వారంలో రెండు రోజులు పాఠశాలను తనిఖీ చేసి అక్కడే భోజనం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంఈవో వెంకట్, తహసీల్దార్ గోవిందమ్మ, డిప్యూటీ తహసీల్దార్ నర్సిములు, ఎంపీడీవో గ్యామానాయక్ ఉన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు



రంగారెడ్డి జిల్లాలో జెడ్పీటీసీలు 21 ఎంపీటీసీలు 230
వికారాబాద్‌లో ఎంపీటీసీలు 227, జెడ్పీటీసీలు 20

రంగారెడ్డి అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక పోరుకు రంగం సిద్ధమవుతోంది. జిల్లా పరిషత్, మండల పరిషత్ స్థానాలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని మేడ్చల్ జిల్లాలోని అన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో అక్కడ ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు లేకుండా పోయాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో రెండు జెడ్పీపీ స్థానాలు, 41 జెడ్పీటీసీ స్థానాలు, 41 ఎంపీపీ స్థానాలు, 457 ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. కాగా, రంగారెడ్డి జిల్లాలో 21 జెడ్పీటీసీలు, 21 ఎంపీపీలు, 230 ఎంపీటీసీ స్థానాలు, వికారాబాద్ జిల్లాలో 20 జెడ్పీటీసీ, 20 ఎంపీపీపీ, 227 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేస్తూ ఉత్వర్వులు వెలువడ్డాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్



శామీర్‌పేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుర్కపల్లిలో కొనసాగుతున్న కూకట్‌పల్లి నియోజకవర్గ బీసీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శిలారమణిపై సస్పెన్షన్ వేటు పడింది. తెలంగాణ బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్ తీరుపై సోమవారం విద్యార్థులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ మను చౌదరి మంగళవారం పాఠశాలను సందర్శించారు. సమస్యలను, ప్రిన్స్‌పాల్ నిర్లక్ష్యంపై విద్యార్థులను అడిగి తెలుసుకొని నివేదిక పంపారు. దీంతో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

చెరువులో దూకిన మహిళ.. కాపాడిన వార్డర్



వార్డర్ లక్ష్మీరెడ్డి

వికారాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): చెరువులో దూకిన ఓ మహిళను జైలు వార్డర్ కాపాడాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. గోదంగూడకు చెందిన ఎదిరి నర్సమ్మ(45) మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో శ్రీసాయి డెంటల్ కళాశాల ఎదుట శివసాగర్ చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ సమయంలో ఆ దారి గుండా వెళ్తున్న జైలు వార్డర్ లక్ష్మీరెడ్డి వెంటనే స్పందించి చెరువులోకి దిగి నర్సమ్మను కాపాడారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 ఈఎంటీ మోహన్, పైలట్ శ్రీకాంత్ అక్కడికి చేరుకొని నర్సమ్మను వికారాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళ కోలుకుంటోందని వైద్యులు తెలిపారు. మహిళ ప్రాణాలను కాపాడిన లక్ష్మీరెడ్డిని స్థానికులు, అధికారులు అభినందించారు.

అడ్మిషన్ల పెంపునకు కృషి చేయాలి

- ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ జ్యోత్స్నారాణి



మాట్లాడుతున్న జ్యోత్స్నారాణి

వికారాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల పెంపునకు ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోత్స్నారాణి సూచించారు. బుధవారం వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జరిగిన ప్రిన్సిపాళ్ల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రిన్సిపాళ్లు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి సంస్థల ద్వారా ఎప్సెట్, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలల మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై ప్రిన్సిపాళ్లతో చర్చించారు. ఇటీవల జిల్లాలో నూతనంగా నియమితులైన ప్రిన్సిపాళ్లు రోజారాణి, వసంత, రవణకుమారిలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రూపాలక్ష్మి, నర్సింహారెడ్డి, కుమారస్వామి, బుచ్చిరెడ్డి, సురేశ్వర స్వామి, వెంకటేశ్వర్ రావు, సిబ్బంది మల్లినాథప్ప, పండరి, మక్బుల్, వినోద్, సలీమాబేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచాలి

- జిల్లా వైద్యాధికారి లలితాదేవి



వికారాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా వైద్యాధికారి లలితాదేవి పేర్కొన్నారు. ప్రస్తుతం దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులకు మూతలు పెట్టాలని, విధిగా వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలని సూచించారు. డెంగీ అనుమానం వచ్చిన వెంటనే పరీక్ష చేయించి చికిత్స తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు నిర్ధారణ లేకుండా చికిత్స ఇవ్వకూడదన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎపిడమిక్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటించి, సీజనల్ వ్యాధులు నుంచి రక్షణ పొందాలని డీఎంహెచ్‌వో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సిట్ విచారణకు నేతల క్యూ



బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్

తాండూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి తాండూరుకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు సిట్ విచారణకు క్యూ కడుతున్నారు. ఇటీవల పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, పెద్దేముల్ కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్ హాజరయ్యారు. తాజాగా బుధవారం తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి సైతం విచారణకు హాజరయ్యారు. గత అసెంబ్లీలో రాజకీయ నాయకుల సెల్‌ఫోన్‌లు ట్యాపింగ్‌కు గురై ఈ సమయంలో సిట్ అధికారులు తాండూరుకు చెందిన పలువురు నేతలను జూబ్లిహిల్స్‌కు పంపించి వాగ్మూలం తీసుకుంటున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారులు

దౌల్తాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేవరఫస్లాబాద్ రైతు వేదికలో బుధవారం ఉద్యానశాఖ అధికారులు రైతులకు అయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. అధికారి రంగనాయకులు ఆయిల్‌పామ్ ప్రాముఖ్యం, శాస్త్రయ విధానాలు, కలిగే లాభాలపై వివరించారు. ఆయిల్‌పామ్ సాగు రైతులకు శాశ్వత ఆదాయ వనరుగా మారుతుందన్నారు.సురేంద్రనాథ్, సత్తార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని తెలంగాణే లక్ష్యం

బషీరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మొక్కలునాటి..సంరక్షించి భావితరాలకు పచ్చదనాన్ని, వృక్షఫలాలను అందిద్దామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కాశీంపూర్‌లో ఎక్సైజ్, అటవీశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవానికి ఎమ్మెల్యే హాజరై మధుసూదన్‌గౌడ్‌కు చెందిన ఎకరాభూమిలో ఈత మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ.. గౌడవృత్తినికాపాడేందుకు ప్రభుత్వ భూముల్లో ఈత మొక్కలను నాటుతాం అన్నారు. కార్యక్రమంలో అబ్కారీశాఖ జిల్లా అధికారి విజయ్ భాస్కర్‌గౌడ్, ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ షాహిదాబేగం, ఎంపీడీవో విజయ్‌కుమార్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, నవాంద్గీ సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్‌చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ కాశప్ప, శ్రీదేవిసరస్వతి, స్నేహశ్రీ నాయకుడు దుశ్యంత్‌రెడ్డి, పాల్గొన్నారు.


కార్యక్రమం లో మట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎవరికీ లంచాలివ్వొద్దు

సంక్షేమ పథకాల కోసం ఎవరికీ నయాపైసా లంచం ఇవ్వొద్దని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. ఎక్మాయిలో పుష్పలి అలివేలుకు మంజూరైన ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు అందరికీ వస్తాయని, తమకు రాలేదని ఎవరూ దిగులుపడొద్దన్నారు. అంతకు ముందు రూ.10లక్షలతో చేపట్టే రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

పరిగి,జూలై 16(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహిళా సంఘాలకు రూ.11.11కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు పెట్రోల్ పంపులు, అద్దె ఆర్టీసీ బస్సుల నిర్వహణ తదితర అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో కొత్తగా 5,143 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, అదనపుపీడీ నర్సింహులు, తహసీలార్లు వెంకటేశ్వరి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి రోడ్డు వేస్తాం

పూడూరు: ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం చిట్టెంపల్లి నుంచి లాల్‌పహాడ్ వరకు రూ.20కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తండాల అనుసంధానానికి లింక్ రోడ్లు వేస్తామన్నారు. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డును నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు.


మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


అవుశాపూర్‌లో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా

విధిగా మొక్కలు నాటాలి

ఘట్‌కేసర్‌రూరల్; జూలై 16(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడమే కాదు.. అవి వృక్షాలుగా ఎదిగేలా సంరక్షిస్తేనే వన మహోత్సవ కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. ఘట్‌కేసర్ పరిధి అవుశాపూర్‌లో బుధవారం ఆమె మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేష్, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, జంగయ్య, ఎ.మశ్చేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అవుశాపూర్‌లో నీటిసమస్య తీవ్రంగా ఉందని, గోదావరి నీరు రావడం లేదని గ్రామస్తుడు మశ్చేందర్‌రెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రోజుకు పదిసార్లు కరెంటు పోతోందని తెలిపారు. సాగుకు నీరు సరిపోవడం లేదని, గృహాల్లోనూ ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మూడుచింతలపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి లక్మాపూర్‌తండాకు తాగునీరు సరఫరా కావడంలేదని, ఈ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథం అన్నారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని రోజులుగా తండాకు మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. తండా వాసులు తాగునీటిని వ్యవసాయ బోర్ల నుంచి తెచ్చుకుంటున్నారని తెలిపారు.

మానవతను నేర్పించడం గురుతర బాధ్యత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, భాస్కరయోగి

పరిగి,జూలై 16(ఆంధ్రజ్యోతి): మానవతా విలువలను నేర్పించడమే గురుతర బాధ్యత అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి ఆధ్వర్యంలో బుధవారం పరిగిలోని జరిగిన గురుపౌర్ణమి వేడుకలో పాల్గొని మాట్లాడారు. గురువు మార్గదర్శకుడన్నారు. మంచి, చెడులను గుర్తించి సన్మార్గంలో పయనించేలా దారి చూపేది గురువుని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రజలు దైవభక్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

చండీ యాగానికి తరలిన అర్చకులు


చండీ యాగంలో వాసుదేవశర్మ, అర్చకులు

కొడంగల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో తలపెట్టిన చండీ కుబేర పాశుపత యాగానికి కొడంగల్ నుంచి అర్చకులు తరలివెళ్లారు. అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో మూడు రోజులు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి యాగశాలలో దేవతామూర్తులను దర్శించుకున్నారని జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థ చారి తెలిపారు. నటరాజ్, అఖిలేశ్, జగదీశ్, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

దుద్యాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి 8వ వార్డులో పోచమ్మ ఆలయాన్ని నిర్మించారు. బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో

మర్పల్లి, జూలై16(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలకు ప్రత్యేకాధికారి వద్దంటూ విద్యార్థినులు ఆదివారం ఆందోళన చేశారు. దీంతో బుధవారం డీఈవో రేణుకాదేవి పాఠశాలను తనిఖీ చేశారు. స్కూలులో జరిగిన సంఘటనపై ఆమె ఆరా తీశారు. బాలికలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలోకి విలేకరులకు అనుమతివ్వకుండా అంతర్గతంగా విచారణ చేయడం గమనార్హం.

తాండూరులో హస్తకళల ఎగ్జిబిషన్


తాండూరులో హ్యాండీ క్రాఫ్ట్ స్టాళ్లు

తాండూరు,జూలై16(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌లూమ్, హ్యాండీక్రాఫ్ట్ స్టాళ్లను తాండూరులో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల కళాకారులు తయారు చేసిన వస్తువులను 60శాతం సబ్సిడీపై అమ్ముతున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల ఎంబ్రాయిడరీ, ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ చీరలు, గద్వాల్, నారాయణపేట్, పోచంపల్లి, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్ విక్రయిస్తున్నారు.

వానల కోసం జలాభిషేకం


పట్లూర్‌లో వరదపాశంపోసేందుకు వెళ్తున్న గ్రామస్తులు

మర్పల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వరుణ దేవుడు కరుణించడం లేదని పట్లూర్‌లో బుధవారం సోమేశ్వరాలయంలో గ్రామస్తులు జలాభిషేకం నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి పూజలు చేశారు. భజనలతో ఆలయ ఆవరణలో వరదపాశం పోశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని ప్రజలు కోరుకున్నారు.

జుంటువాగు కబ్జాపై అధికారుల సర్వే


సర్వే చేస్తున్న అధికారులు

బషీరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ రోడ్డులోని జుంటువాగుకబ్జాపై తాండూరు ఇరిగేషన్ డీఈఈ శిరీష, ఏఈ సాయి, రెవెన్యూ గోపి, సర్వేయర్ మహేశ్ బుధవారం రెండోసారి సర్వే చేశారు. మ్యాప్‌ను పరిశీలిస్తూ హద్దులను గుర్తించారు. వారం కిందట యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్య సర్వే చేయించి 5మీటర్ల వెడల్పు, 200మీటర్ల పొడవున వాగును కబ్జా చేశారని తేల్చి హద్దులు పాతారు. అయితే సాగు భూమిలో గదుల నిర్మాణ ప్రాంతం తాండూరు మండల పరిధికి వస్తుందని, ప్రభుత్వ భూమిగా మ్యాప్‌లో చూపుతోందని వెల్లడించారు. ఈ క్రమంలో మరోసారి సర్వే చేసిన అధికారులు వాగు కబ్జా పరిధి యలాల మండలంలో ఉందని నిర్ధారించారు. భూ యజమాని పొలం అర ఎకరం మాత్రం తాండూరు పరిధికి వస్తుందని నిర్ధారించారు. గదుల నిర్మాణ ఏరియాపై పట్టాపాసు పుస్తకాలను పరిశీలిస్తామని అన్నారు. అధికారుల వీరి వెంట వర్క్‌ఇన్స్‌పెక్టర్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

మంచాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మంచాలలో బుధవారం ఆయన వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో ముచ్చటించి సమాజంలో నెలకొన్న నేరప్రవృత్తిపై అవగాహన కల్పించారు. అపరిచిత వక్తులతో వాట్సాప్, వీడియోకాల్స్ మాట్లాడవద్దని, చిన్నారులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని తలిదండ్రులకు సూచించారు. యువతీయువకులు ఆన్‌లైన్ గేమింగ్, మత్తుపదార్థాలు, తదితర వ్యవనాలకు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మంచాల సీఐ మధు, ఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కేపీవీ రాజు

రీజియన్‌లో ఆర్టీసీని లాభాల్లోకి తెస్తాం

» ఆర్‌ఎం శ్రీలత

తాండూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రీజియన్ పరిధిలో ఆర్టీసీ నష్టాల్లో ఉందని, సంస్థను లాభాల్లోకి తెచ్చే చర్యలు చేపడుతున్నామని రీజినల్ మేనేజర్ శ్రీలత చెప్పారు. బుధవారం తాండూరు డిపోలో ఆమె మాట్లాడారు. పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీలతో సర్వీసులు నడుపుతున్నామన్నారు. తాండూరు-మహబూబ్‌నగర్ రూట్లో సర్వీసులను పెంచామని, వికారాబాద్-సంగారెడ్డి రూట్లో బస్సులు నడుపుతున్నామని చెప్పారు. తాండూరు-బీదర్‌కు సర్వీస్‌ను నడిపేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే తాండూరు ఆర్టీసీ డిపోలో రీజినల్ మేనేజర్ శ్రీలతఉద్యోగులు, సిబ్బందితో సమీక్షించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందితో విడివిడిగా మాట్లాడారు. ప్రయాణికుల రద్దీ ఉండే రూట్లలో బస్సు సర్వీసులను పెంచాలని ఆదేశించారు. సమావేశంలో డీవీ ఆర్ఎం సరస్వతి, మెకానికల్ ఆర్ఎం సుగుణాకర్, తాండూరు డీఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ మోహన్

కడ్తాల్, జూలై 16(ఆంధ్ర జ్యోతి): విద్యుత్, లో-వోల్టేజీ సమస్యలను పరిష్కరించి రైతులు, వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ముందుకు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ డీఎస్ మోహన్ తెలిపారు. కడ్తాల మండలం మక్తమాదారంలో బుధవారం ఎస్ఈ పర్యటించారు. ఏడీఈ బాలకృష్ణారావు, ఏఈ నరేందర్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి మాదారం, పరిసర ప్రాంతాల రైతులతో సమావేశమయ్యారు. పలువురు రైతులు తమ సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకువచ్చారు. మాదారం నుంచి కడ్తాల వరకు 33 కేవీ ఇంటర్ లింకింగ్‌లైన్ పనులు వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఎస్ఈ ఆదేశించారు. విద్యుత్ పిర్యాదులపై అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. మక్తమాదారంలో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని ఎస్ఈ పరిశీలించారు. నిర్మాణం పనులు త్వరలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఏఈలు నరేందర్, విజయ్, కాంట్రాక్టర్ కృష్ణయ్య, నాయకులు బాల్‌రాజ్, షాబోద్దీన్, తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

శంషాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ నేతృత్వంలో బుధవారం శంషాబాద్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాలల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించక పోవడం సిగ్గుచేటన్నారు. అంతకు ముందు జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శ్రీకాంత్, చరణ్, వరుణ్ వంశీ, తరంగ్, విప్లవ్, హర్ష, తదితరులు పాల్గొన్నారు.


పట్టాలు అందిస్తున్న ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్

రైతులకు మేలు చేయడమే లక్ష్యం

మొయినాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎన్కెపల్లి రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. బుధవారం మండలంలోని ఎన్కెపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 180లో గల భూమిని ప్రభుత్వం గోశాల ఏర్పాటు కోసం తీసుకుంటుండగా.. ఆరు కుటుంబాలకు చెందిన 16 మంది రైతులకు ఎకరానికి 300 గజాల చొప్పున కేటాయించారు. ఈమేరకు వారికి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ కాపీలు వారు అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఎకరాకు మూడు వందల గజాల స్థలం ఇస్తున్నట్లు చెప్పారు. దళారుల మాటలు నమ్మకుండా మిగతా రైతులు కూడా ముందుకొచ్చి పట్టాలు తీసుకోవాలని సూచించారు. రైతుల కుటుంబాల నుంచి ఒకరికి అవుట్ సోర్సింగ్ జాబ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, అధికారులు పాల్గొన్నారు.


రాజేందర్‌యాదవ్‌కు గులాబీ కండువా కప్పుతున్న దశరథ్ నాయక్

ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

కడ్తాల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామానికి చెందిన మర్ల రాజేందర్ యాదవ్ బుధవారం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. మాజీ సర్పంచ్‌లు సులోచన సాయిలు, భాగ్యమ్మ జంగయ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జలీల్, చందు, సోమ్లు, కిషన్, జగన్, రాజేశ్, శ్రీకాంత్, లచ్చిరామ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు

మొయినాబాద్ రూరల్, జూలై 16(ఆంధ్యజ్యోతి): ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు ఉంటాయని మొయినాబాద్ తహసీల్దార్ గౌతం కుమార్ హెచ్చరించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లోని సర్వేనంబర్ 176లో గల దాదాపు 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ నిర్మాణ పనులను బుధవారం మొయినాబాద్ మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. 10 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నించగా అధికారులు ఫెన్సింగ్‌ను తొలగించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

షాద్‌నగర్ అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి వైద్యం చేయించుకున్న పేదలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 34మందికి బుధవారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో చెక్కులను, ఎల్ఓసీలను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు శేఖర్ పంతులు, యారం శేఖర్‌రెడ్డి, యాదగిరి రావు, రామకృష్ణ, బాబురావు, మదుసూదన్ రావు, బాల్‌రాజుగౌడ్, శ్రీశైలం, గోపాల్‌గౌడ్, మధుసూదన్‌రావు, ఆంజనేయులు, నరేందర్, ఆనంద్‌యాదవ్, రెడ్యానాయక్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


పూజలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని సెంగెంలో బుధవారం పోచమ్మ, భువనేశ్వరి, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ యాదయ్య యాదవ్, డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, వీరేశ్, జగదీశ్వరప్ప, రాణి, అనసూయమ్మ పల్లె ఆనంద్ కుమార్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, వై.గిరిధర్‌యాదవ్, రూప్లానాయక్, అంజయ్య, కరుణాకర్‌రెడ్డి, ఇబ్రహీం, తైద పర్వతాలు, నాగేష్, శ్రీనాథ్, అఖిల్, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు. కాగా, గ్రామానికి చెందిన రాఘవేందర్, సరేష్, నర్సింగ్, వెంకటేష్ దంపతులు హోమం నిర్వహించారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఇదిలా ఉంటే, గ్రామానికి చెందిన కొందరు మహిళలు ఎమ్మెల్యే కలిశారు. తమకు ఇళ్లు ఇప్పించాలని కోరారు. కొంతమందికి స్థలం కూడా లేదని తెలిపారు. దాంతో అర్హులందరికీ ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు. స్థలాలు చూపిస్తే ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సంగెం మహిళల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకుడు ఇబ్రహీంను ఆదేశించారు.

భూ సమస్యలకు పరిష్కారమెప్పుడో?

రెవెన్యూ సదస్సుల్లో రైతుల విన్నపాలు.. ● యాచారంలో పరిధిలో 2,057 దరఖాస్తులు


చింతపట్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు (ఫైల్)

యాచారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ఇటీవల అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కానీ, సమస్యలు నెరవేర్చడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు గ్రామాలలో పర్యటించి వాస్తవాలు విచారించకుండా ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రాం(ఎల్ఆర్‌యూపీ) ఆధారంగా పట్టా భూములను భూదాన్ భూములుగా నమోదు చేయడం దారుణమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టా భూమి భూదాన్ భూమిగా నమోదైతే ఆర్ఐ, సర్వేయర్ల చేత విచారణ చేయకుండా ఎల్ఆర్‌యూపీ కింద భావించి రెవెన్యూ అధికారులు రైతులకు తీవ్ర అన్యాయం చేశారని రైతులు మండిపడుతున్నారు. పట్టాభూమి భూదాన్ భూమిగా నమోదు కావడంతో తమ అవసరాల కోసం క్రయ విక్రయాలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. మ్యుటేషన్, టీఎం 33, ఆన్‌లైన్‌లో రికార్డులను నమోదు చేయడం, గ్రామకంఠం భూములను గుర్తించి పంచాయతీకి అప్పగించాలని తదితర డిమాండ్లతో 2057 దరఖాస్తులను రెవెన్యూ అధికారులు రైతుల నుంచి స్వీకరించారు. కాగా, సదస్సులు ముగిసి నెల రోజులు దాటినా ఏ ఒక్క సమస్యనూ అధికారులు నెరవేర్చలేకపోతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంతన్‌గౌరెల్లిలో గ్రామకంఠం భూమి సర్వే చేసి పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పట్టా సర్టిఫికెట్లు అందించాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఫార్మాసిటీ పరిధి గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో నిషేధిత జాబితాలో ఉన్న 2,500 ఎకరాల పట్టా భూములను రైతుల పేరిట నమోదు చేయాలని దరఖాస్తు చేసినా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని రైతులు చెబుతున్నారు.

పట్టా భూమిని భూదాన్ భూమిగా నమోదు చేశారు



తనకు గ్రామంలోని 386 సర్వే నెంబర్‌లో 2ఎకరాల 32 గుంటల పట్టా భూమి ఉంది. అధికారులు భూదాన్ భూమిగా నమోదు చేసి అన్యాయం చేశారు. మా తండ్రి నుంచి బి(2327/99), బి/4216/02 ప్రకారం భూమిని కొనుగోలు చేశా. పట్టాభూమి అని రెవెన్యూ అధికారులు ఎందుకు గమనించలేదో అర్థమైతలేదు. మా భూమి భూదాన్‌భూమిగా నమోదు చేసి అన్యాయం చేశారు. నాకు తగిన న్యాయం చేయాలి.

- పాల పెద్దమ్మ, గాండ్లగూడ

ఫిర్యాదులను ఆన్‌లైన్ చేస్తున్నాం



రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదులను ఆన్‌లైన్ చేస్తున్నాం. ఎల్ఆర్‌యూపీ ఆధారంగా భూదాన్‌భూమిగా నమోదైన భూములు పట్టాభూములైతే.. భూదాన్ బోర్డు నుంచి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ తెచ్చుకుంటే రికార్డులను సరిచేస్తాం. తాము కావాలని ఏ ఒక్క రైతుకు అన్యాయం చేయలేదు. రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇలాంటివి కలెక్టర్, ఆర్డీవో దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- టి.అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

ఎల్ఆర్‌యూపీతో రైతులకు అన్యాయం



ఎల్ఆర్‌యూపీ(ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రాం)ను భగవద్గీతగా నమ్మి అధికారులు రైతులకు తీవ్ర అన్యాయం చేశారు. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులతో, భూదాన్ బోర్డు అధికారులతో మాట్లాడి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెవెన్యూ అధికారులు గ్రామాలలో విచారణ చేసి పట్టాభూమి భూదాన్‌భూమిగా నమోదైతే పట్టాభూమిగా రికార్డులు నమోదు చేయాల్సింది.

- ఎం.కోదండరెడ్డి, రైతు వ్యవసాయ సంక్షేమ కమిషన్ ఛైర్మన్


పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్న పోలీసులు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


కంటైనర్‌లో పశువులు

కడ్తాల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 105 పశువులను పోలీసులు పట్టుకున్నారు. కడ్తాల్ టోల్ గేటు దగ్గర బుధవారం ఈ సంఘటన జరిగింది. స్థానిక సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. ఏపీ 29 టీబీ 3545 నెంబరు గల కంటైనర్‌లో పశువులను తరలిస్తుండగా పోలీసులు ఆపి విచారించగా అనుమతులు లేవు. దీంతో కామదేను సమర్థ గోశాల జియాగూడలో సేఫ్ కస్టడీ నిమిత్తం అప్పగించారు. అందులో 105 పశువులు ఉండగా.. 64 ఆవులు, 41 ఎద్దులు ఉన్నాయి. అందులో ఓ ఎద్దు, నాలుగు ఆవులు చనిపోయినట్లు గుర్తించారు. యజమాని ఎండీ తాలీమ్, డ్రైవర్ మహ్మద్ జాఫర్, ఖురేషి, లేబర్‌లు సర్ఫరాజ్, చాంద్, దర్శనం, కృష్ణలపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ శోభారాణి

షాద్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తే ఫార్మసీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జేఎన్‌టీయూ ఫార్మా విభాగం అధిపతి ప్రొఫెసర్ శోభారాణి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ పరిధిలోని న్యాక్ గుర్తింపు పొందిన మూన్‌రే ఫార్మా కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే ఎమ్‌పీఎస్‌సీవో సదస్సును ఆమె ప్రారంభించి ప్రసంగించారు. వైద్య రంగంలో ఫార్మా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఫార్మసీ విద్య పూర్తి చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు తమ కళాశాలలో ఉన్న ఫార్మసీ కోర్సులతో పాటు త్వరలోనే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సదస్సులో కళాశాల డైరెక్టర్ కె.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


చేవెళ్లలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పచ్చని తెలంగాణే లక్ష్యంగా వన మహోత్సవానికి శ్రీకారం చుట్టామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మోడల్ కాలనీ, మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెట్లు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల మున్సిపాల్ కమిషనర్ వెంకటేశం, పీఏసీఎస్ ఛైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎర్ర మల్లేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, పాండుయాదవ్, మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

» డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు

షాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు అన్నారు. షాబాద్ పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలింతకి వైద్య పరీక్షలు చేశారు. డెలివరీ కేసులు ఎన్ని వస్తున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, లేనిచో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట జూనియర్ అసిస్టెంట్ శ్యాంరావు, వైద్య సిబ్బంది సౌజన్య, మంజుల, శ్రీధర్ ఉన్నారు.


బాలేశ్వర్‌గుప్తాను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా ఎలక్షన్ కన్వీనర్‌గా బాలేశ్వర్‌గుప్తా

» నియమించిన పార్టీ అధిష్ఠానం



యాలాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాకు బీజేపీ రాష్ట్ర అధిష్ఠానం ఉత్తమ గుర్తింపునిచ్చింది. ఆయనను పార్టీ వికారాబాద్ జిల్లా ఎలెక్షన్ కన్వీనర్‌గా నియమించింది. బాలేశ్వర్‌గుప్తాకు జిల్లా ఎలెక్షన్ కన్వీనర్‌గా నియమించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బాలేశ్వర్‌గుప్తా సర్పంచ్‌గా, ఎంపీపీగా, ప్యాక్స్ ఛైర్మన్‌గా ప్రజలకు సేవలందించారు. బీజేపీలో చురుకైన పాత్రపోషిస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నారు. ఈ సందర్భంగా బాలేశ్వర్‌గుప్తా మాట్లాడుతూ.. తనకు జిల్లా ఎన్నికల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని చెప్పారు. బాధ్యతను కట్టబెట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలేశ్వర్‌గుప్తాకు నాయకుల సన్మానం

తాండూరు: బీజేపీ జిల్లా ఎన్నికల కన్వీనర్‌గా నియమితులైన బాలేశ్వర్ గుప్తాను బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాలి శివకుమార్, పార్టీ యువ నాయకుడు పటేల్ విజయ్‌కుమార్, నాయకులు మురళీకృష్ణ, సుదర్శన్‌గౌడ్, సాయిరెడ్డి, శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

» ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

శంకర్‌పల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వర్షపు చినుకులు పడగానే రైతుబంధు డబ్బులు పడేవని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. జన్వాడలో బుధవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. కేసీఆర్‌ను విమర్శించకుండా కాంగ్రెస్ నాయకులు సభలు, సమావేశాలు పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు సరిపోక.. లబ్దిదారులు ఇల్లు కట్టుకోవడానికి అయిష్టత వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ శశిధర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ నారాయణ, మాజీ మార్కెట్ ఛైర్మన్లు రాజునాయక్, మాణిక్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ వెంకటేష్. మాజీ సర్పంచులు నర్సింహరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, సత్యనారాయణరెడ్డి. మాజీ ఎంపీటీసీలు సురేందర్‌రెడ్డి, నాగేందర్. నాయకులు తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయండి

ఇబ్రహీంపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ వైద్య సేవలను విస్తరించాలని ఇబ్రహీంపట్నం మండల బీజేపీ కమిటీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు ముత్యాల మహేందర్ మాట్లాడుతూ 30 పడకలతో ఉన్న ఆసుపత్రిలో సిబ్బంది, సౌకర్యాల కొరత ఉందన్నారు. వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ 24 గంటలు వైద్య సేవలు అందేలా చూడాలని కమిషనర్‌ను కోరినట్ల తెలిపారు. బీజేపీ నాయకులు ఆడెపు రాఘవేందర్, విజయ్‌కుమార్, అనిల్, సంతోష్ తదితరులున్నారు.

ఫిల్మ్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో అవగాహన పెంచుకోవాలి

చేవెళ్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫిల్మ్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో అవగాహన పెంచుకోవాలని ఎన్‌ఏసీ(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్-హైదరాబాద్) అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య, ప్రసాద్, శాస్త్రి, చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలతలు తెలిపారు. బుధవారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఏసీ, స్పేస్ అకాడమీ-హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కన్‌స్ట్రక్షన్, ఫిల్మ్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుతోపాటు వృత్తి విద్యా రంగాల్లో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అధ్యాపకులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అందించాలి



మాట్లాడుతున్న నాయకుడు మహిపాల్

నవాబుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలు, ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. వేతనం రూ.26వేలు, ప్రమాద బీమా రూ.20లక్షలు, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు కుమార్, అంజయ్య, లక్ష్మారెడ్డి, మల్లేశ్, దుర్గయ్య, నర్సిములు, మంజుల, రాములు, నాగేందర్, గోపాల్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, శివకుమార్, గోపాల్, నర్సిములు, జంగయ్య, రాములు, శివరాజ్ పాల్గొన్నారు.

కల్లులో నిషేధిత పదార్థాలు కలపొద్దు



ధారూరులో కల్లు దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది

ధారూరు, జూలై16(ఆంధ్రజ్యోతి): కల్లులో నిషేధిత రసాయనాలను కలపొద్దని ఎక్సైజ్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి దుకాణాదారులను హెచ్చరించారు. ధారూరులోని కల్లు దుకాణాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కల్లును పది రోజుల కంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంచొద్దన్నారు. ఎలాంటి మత్తు పదార్థాలు కలపొద్దని సూచించారు. కల్లు తయారీకి స్వచ్ఛమైన నీటినే వాడాలన్నారు. దుకాణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కలుషిత కల్లుతో మనుషుల ప్రాణాలకు ముప్పు అన్నారు. డీఎస్పీ వెంట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

ఓటర్ల నమోదుపై బీఎల్వోలు విస్తృత ప్రచారం చేయాలి

తాండూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదుపై బీఎల్‌వోలు విస్తృత ప్రచారం చేయాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. బుధవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు శిక్షణ నిర్వహించగా తహసీల్దార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామం, పట్టణంలో 18ఏళ్లు నిండిన వారంతా ఓటునమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల నమోదు, మృతి చెందిన వారి పేర్లు తొలగింపు, ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో లిస్టులో తమ పేర్లు ఉన్నాయో లేవో ప్రజలు చూసుకోవాలన్నారు. డీటీ లలిత, ట్రైనర్లు వీరేశం, ముజాయిద్ పాల్గొన్నారు.



బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ తారాసింగ్

కబ్జా నుంచి కాపాడి.. మొక్కలు నాటి

- స్వాధీనం చేసుకున్న 25 ఎకరాల్లో వేలాది మొక్కలు పెంచుతున్న అధికారులు



ధారూరు అటవీ భూమిలో నాటిన మొక్కలు

ధారూరు, జూలై16(ఆంధ్రజ్యోతి): ధారూరు అటవీ రేంజ్ పరిధి స్టేషన్ ధారూరు సెక్షన్ 98వ కంపార్ట్‌మెంట్ ప్రాంతంలో గతేడాది అడవిని ఆక్రమించి కందిపంట వేశారు. అక్రమార్కులు. అటవీ భూమి కబ్జాపై 2024 ఆగస్టు 1న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ధారూరు అటవీ రేంజర్ రాజేందర్ స్పందించారు. కబ్జాకు గురైన భూమిని పరిశీలించి కంది మొక్కలను సిబ్బందితో పీకేయించారు. పదెకరాల అటవీ భూమిలో ప్లాంటేషన్‌ను సంగాయిపల్లి తండా, మందనంతాపూర్‌లకు చెందిన వారు దున్ని కబ్జాకు యత్నించినట్టు గుర్తించారు. దీంతో ఈ అటవీ భూమిలో మొక్కలు నాటేందుకు నిర్ణయించి ఏడాదిలోపు పని పూర్తి చేశారు.

11,110 మొక్కలు నాటిన అధికారులు

రిజర్వ్ ఫారెస్టులోని 25 ఎకరాల్లో అధికారులు 11,110 మొక్కలు నాటించారు. వాటిలో రావి, అల్లనేరేడు, నెమలి నార, కానుగ, వేప, సీతాఫల్, ఉసిరి, తెల్ల మద్ది, జువ్వి తదితర మొక్కలు ఉన్నాయి. ఆక్రమణకు గురైన అటవీ భూమి ఇప్పుడు మొక్కలతో కళకళలాడుతోంది. అధికారులు వాటిని సంరక్షిస్తున్నారు.

రైతులు తమ విస్తీర్ణం మేరకే సాగు చేసుకోవాలి



అటవీ భూములను ఆక్రమిస్తే ఆ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నాం. పోడు, అసైన్డ్, పట్టాదారులు తమకు పట్టా కాగితాల్లో ఉన్న విస్తీర్ణం మేరకు కాకుండా పక్కన ఉన్న అటవీ భూమిని ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. రైతులు ఆక్రమించిన అటవీ భూములను స్వాధీనం చేసుకుంటాం. గత ఏడాది ఏడుఖానాల వద్ద పది ఎకరాల అటవీ భూమిని కబ్జా చేసి సాగు చేసిన కంది పంటను దున్నేశాం. ఈ అటవీ ప్రాంతంలోని 25 ఎకరాల్లో వివిధ రకాల మొక్కలు నాటి సంరక్షిస్తున్నాం.

– రాజేందర్, ధారూరు ఫారెస్ట్ రేంజర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కొడంగల్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్/బంట్వారం/తాండూరురూరల్/యాలాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణ శివారులోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని టీచర్లకు సూచించారు. వంట గది, స్టోర్ రూమ్, కూరగాయలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బంట్వారం తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు కస్తూర్బా పాఠశాల తనిఖీ నిర్వహించారు. విద్యార్థినులను సమస్యలపై అడిగారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని అడిగారు. కార్యక్రమంలో టీచర్ శైలజ పాల్గొన్నారు. తాండూరు మండలం చెనిగేష్‌పూర్ మార్గంలోని బీసీ బాలికల హాస్టల్‌ను తహసీల్దార్ సందర్శించారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంట ప్రిన్సిపాల్ శివగీత ఉన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని యాలాల తహసీల్దార్ వెంటస్వామి, ఎంపీడీవో పుష్పలీల అన్నారు. యాలాల కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్వో మంగమ్మకు చెప్పారు. వంట గదిని శుభ్రంచేసేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ చరణ్ ఉన్నారు.



బంట్వారం: హాస్టల్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు

ప్రతీ మొక్కను సంరక్షించాలి



శామీర్‌పేట మహిళా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న కమిషనర్ జ్యోతి, టీచర్లు విద్యార్థినులు

శామీర్‌పేట/పరిగి/మోమిన్‌పేట్/కీసర రూరల్, జూలై16(ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. బుధవారం శామీర్‌పేటలోని మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. విద్యార్థినులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతి ఇంటికి ఐదు మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ చెప్పారు. పరిగి మండలం సయ్యద్‌పల్లిలో మొక్కలను పంపిణీ చేశారు. నాటిన ప్రతి మొక్కను పెంచే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ప్రధానోపాధ్యాయుడు దండు రమేశ్ అన్నారు. మోమిన్‌పేట్ మండలం ఎన్కతల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడం బాధ్యతగా స్వీకరించాలని క్రాంతి కీన్ పాఠశాల కరస్పాండెంట్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కీసర మండలం దమ్మాయిగూడలో గల పాఠశాల ప్రాంగణంలో 'మొక్క నాటు-గిఫ్టు పట్టు' కార్యక్రమంలో స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. వాటర్ బాటిళ్లు అందజేశారు. మొక్కలు పెంచిన వారికి రేంజర్ సైకిల్, విలువైన బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ కల్యాణి, లావణ్య, బోధనా సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



పరిగి: సయ్యద్‌పల్లి నర్సరీ వద్ద విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది



కీసర రూరల్: మొక్కలు పంపిణీ చేస్తున్న క్రాంతి కీన్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



పర్సాపూర్‌లో రోడ్డు పనుల కోసం చెట్లను తొలగిస్తున్న కూలీలు

కొడంగల్ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో భాగంగా కొడంగల్ మండలం పర్సాపూర్‌లో పనులను బుధవారం ప్రారంభించారు. రోడ్డు కిరువైపులా చెట్లను తొలగించారు. రోడ్డు విస్తరణకు షెడ్లు, ఇళ్లను తొలగించాలని అధికారులు నోటీసులు అందించారు.

విద్యార్థులకు నోటుబుక్‌ల పంపిణీ



విద్యార్థులకు నోటుబుక్‌లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దౌల్తాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు బసవలింగమ్మ బుధవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్సిళ్లు అందజేశారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. టీచర్లు ఉషన్న, శ్రీలత, ప్రభాకర్, సాయిలుగౌడ్, శానమ్మ, మొయినుద్దీన్, వెంకటేశం, మోహన్, నారాయణ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

మర్పల్లి, జూలై16(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మర్పల్లిలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రచారం చేస్తోందని, రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, అశోక్, శంకర్, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఫార్మర్ రిజిస్ట్రీ'కి డబ్బులు తీసుకుంటే చర్యలు

దోమ, జూలై 16(ఆంధ్రజ్యోతి):ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుకు రైతుల నుంచి డబ్బులు తీసుకుంటే చర్యలు తప్పవని ఏడీఏ లక్ష్మీసౌభాగ్య అన్నారు. బుధవారం బ్రాహ్మణపల్లి రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. మల్లెపల్లి, దాదాపూర్ గ్రామాల్లో పంటలు, ఆయిల్‌పామ్ సాగును పరిశీలించారు. అనంతరం దోమలో ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఏవో ప్రభాకర్‌రావు, ఆర్ఐ రాంచందర్‌రావు, ఏఈవోలు చెన్నయ్య, బాబ్యా, రికార్డు అసిస్టెంట్ యాదయ్య రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి పేరు తెచ్చుకోవాలి

యాలాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని తాండూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శరణు అన్నారు. బుధవారం తిమ్మాయిపల్లిలోని పాఠశాలలో విద్యార్థులకు ఆయన తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్లేట్లు, గ్లాసులు, స్కూలుకు సీలింగ్ ఫ్యాన్లను అందించారు. తాను చదివిన పాఠశాలలో క్లబ్ అధ్యక్షుడిగా సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ చంద్ర ప్రకాశ్ రెడ్డి

మేడ్చల్ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం 23వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాలనీలు, బస్తీల్లో సమస్యలుంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మహేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'బీబీసీ' వేధింపుల వల్లే ఉద్యోగి మృతి

మేడ్చల్ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బీబీసీ కళాశాలలో పనిచేసిన ఉద్యోగి కె.నర్సారావు మృతి వివాదానికి దారి తీసింది. యాజమాన్యం వేధింపుల వల్లే అతడు గుండెపోటుతో చనిపోయాడని పలువురు ఆరోపించారు. బీబీసీలో ఫార్మా గ్రాడ్యుయేట్స్ అడ్మిన్ మేనేజర్ భాస్కర్ బుధవారం నర్సారావుకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నర్సారావు చావుకు బీబీసీ యాజమాన్యమే కారణం అని ఆరోపించారు. డబిల్‌పూర్ పరిధి భారత్ బైబిల్ కళాశాల(బీబీసీ)లో ఉద్యోగం చేస్తున్న నర్సారావును కొద్ది రోజుల క్రితం కళాశాల యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించిందన్నారు. అలాగే ఉద్యోగికి ఇవ్వాల్సిన బెనిఫిట్లు ఇవ్వలేదన్నారు. కళాశాల వారి వేధింపులు తట్టుకోలేక నర్సారావు గుండెపోటుతో చనిపోయాడని భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు కారకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. నర్సారావు కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు.

కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం




డీఈవో రేణుకా దేవితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. బుధవారం మర్పల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించేందుకు వెళ్లగా అక్కడే ఉన్న డీఈవో రేణుకా దేవితో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు స్కూల్ ప్రత్యేకాధికారి తమకు వొద్దని ధర్నా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రతీ రోజు ఎక్కడోచోట హాస్టల్ విద్యార్థులు ధర్నాలు, నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెల్ఫేర్ హాస్టళ్లలో సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కలుషితాహారం తిని ఇప్పటి వరకు 1,100 మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలయ్యారని, వంద మంది చనిపోయారన్నారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే పర్యవేక్షిస్తున్న విద్యా శాఖలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అంతకు ముందు ఆయన సిరిపూరం ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. భోజనంలో పురుగులొచ్చిన విషయంపై అడిగి తెలుసుకున్నారు. ఆనంద్ వెంట నాయకులు మధుకర్, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, అశోక్, మోహన్‌రెడ్డి, శంకర్, శ్రీకాంత్, గప్ఫార్, శ్రీనివాస్ ఉన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి'

యాలాల, జూలై 16, (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జుంటుపల్లి, అక్కంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ కర్యకర్తల సమావేశం నిర్వహించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అధిష్టానం అభిప్రాయం మేరకే అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులందరనీ కార్యకర్తలు, నాయకులు గెలిపించేందుకు కృషిచేయాలన్నారు.

గుండె'చెరువు'!



కులకచర్ల మైలమ్మ చెరువులో అడుగంటిన నీరు

(ఐదో పేజీ తరువాయి)

వీలుంటుంది. ఆలస్యమైతే చేప పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందులో 45 రోజుల వయసు ఉన్నవి (35-40 ఎంఎం) ఎక్కువగా, 75 రోజుల వయస్సున్న పెద్ద సైజు చేప పిల్లలు (80-100 ఎంఎం) వంద శాతం రాయితీపై అందించే వారు. 35-40 సెం.మీ. పొడవున్న చేప పిల్లలు సుమారు కిలో తూకం బరువు వచ్చేసరికి ఎనిమిది నెలల సమయం పడుతుంది. ఆలస్యమైతే ఎండ కాలం నాటికి నీరు ఇంకి చేపలు చనిపోతాయి.

గతేడాది 3,707టన్నుల ఉత్పత్తి..

గతేడాది జిల్లాలో 22 చెరువుల్లో బొచ్చె, రవట, బంగారు తీగ, మోసు రకాలకు చెందిన 13.37 లక్షల చేప పిల్లలను వదిలారు. బొచ్చె రకం 5,18,671 పిల్లలు, రవట 6,70,154, బంగారు తీగ 18,747, మోసు 1,29,674 పిల్లలను వదిలారు. కాగా జిల్లాలో మొత్తం 3,707 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తులు జరిగాయి.

మేడ్చల్ జిల్లాలోనూ అదే పరిస్థితి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ ఈ ఏడాది ఇంత వరకు టెండర్ ప్రక్రియ ప్రారంభించలేదు. మేడ్చల్ జిల్లాలో మొత్తం 333 చెరువులు, కుంటలున్నాయి. చెరువుల్లో చేప పిల్లలను సకాలంలో వదలకుంటే ఎదగవని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది కూడా జిల్లాలోని సగం చెరువుల్లో చేపపిల్లల పంపిణీ చేయలేదు. చేప పిల్లల పంపిణీలో వెలుగు చూసిన అక్రమాలతో ప్రభుత్వం పంపిణీని తగ్గించింది. దీనికి తోడు పంపిణీ ఆలస్యంతో ఎదుగుదల లేక అనేక చెరువుల్లో చేపల వేట నిలిపివేశారు. కొన్ని చెరువుల్లో నీటి కొరతతో చేపలు చేతికందలేదని మత్స్యకారులు వాపోతున్నారు. గతంలో ఉచిత చేపపిల్లల పంపిణీలో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్లు చెప్పిన లెక్కలకు ప్యాకెట్‌లో ఉండే చేప పిల్లల సంఖ్యకు పొంతన కుదరడం లేదని మత్స్యకారులు గుర్తు చేస్తున్నారు. గతేడాది అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది చేప పిల్లల సరఫరాదారులతో నిబంధనల ప్రకారం ఒప్పందం కుదుర్చుకుని మత్స్యకారులకు ప్రయోజనమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఆదేశాలు రాగానే పంపిణీ చేస్తాం



ఇప్పటి వరకు సరైన వర్షపాతం లేదు. మంచి వర్షాలు కురిసి చెరువులు నిండితే జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం చేప పిల్లలు పంపిణీ చేస్తాం. ఉచిత చేప పిల్లల పంపిణీపై ఇంకా ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాం.

– వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, వికారాబాద్

చేప పిల్లల పంపిణీ కచ్చితంగా ఉంటుంది

ప్రతీ ఏడాది చేపపిల్లల పంపిణీ ఆగస్టులో ఉంటుంది. ఈ ఏడాది కూడా తప్పకుండా పంపిణీ చేస్తాం. టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. పైఅధికారుల నుంచి ఆదేశాలు రాగానే టెండర్లు నిర్వహిస్తాం. అవసరమైతే షార్ట్ టెండర్ ప్రక్రియ చేపడుతాం. మత్స్యకారులు ఆందోళన చెందొద్దు.

– సుకీర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి, మేడ్చల్

అందరికీ సంక్షేమం

(ఐదో పేజీ తరువాయి)

బిజీగా ఉన్నందున అన్ని శాఖలపై సమీక్షలు నిర్వహించలేదు.

మెరుగైన వైద్యం అందేలా..

జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో పాఠశాలల్లో వసతులు మెరుగుపర్చుకునేందుకు అవకాశం ఉంది. పాఠశాలల్లో మరుగుదొడ్లు,కంప్యూటర్ ల్యాబ్‌లు, తరగతి గదుల నిర్మాణాలు చేపడుతాం. వసతులు మెరుగుపరిస్తే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది. విద్యారంగం అభివృద్ధికి నా వద్ద ఉన్న నిధులను కూడా వెచ్చించి పనులు చేపడుతాం. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందే విధంగా చర్యలు తీసుకుంటాం. సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. అంగన్‌వాడీల అభివృద్ధికి కృషి చేస్తాం. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తాం.

సంక్షిప్తంగా..

● **చౌడాపూర్:** కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని చాకల్‌పల్లి నుంచి ఫతేపూర్ వరకు బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఏళ్లుగా రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం బీటీ రోడ్డు మంజూరు చేయడంతో సమస్య పరిష్కారం అయిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్, బాల్‌రాజ్, చెన్నయ్య, శ్రీను, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● **కొడంగల్:** మండలంలోని అప్పాయిపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాస్, అధ్యక్షుడిగా పకీరప్ప, ఉపాధ్యక్షులు శివప్రసాద్, పకీరప్ప, ప్రధాన కార్యదర్శి సంగప్ప, సహాయ కార్యదర్శులు అబ్బులప్ప, అజయ్, ప్రకాశ్, ఆనంద్, కోశాధికారి నర్సప్ప, సాంస్కృతిక కార్యదర్శి పకీరప్ప, సలహాదారులుగా అంజిలప్ప, రాములు, అమృతప్ప, భగవంతు, శ్రీనివాస్, రాములు, గుండప్ప, సభ్యులుగా నరేశ్, శేఖర్, రమేశ్‌ను ఎన్నుకున్నారు.

● **మేడ్చల్ టౌన్:** ఓ గర్భిణికి పురిటి నొప్పులు రాగా ఆమెను ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో అంబులెన్స్‌లో ప్రసవించింది. బుధవారం మధ్యాహ్నం గుండ్లపోచంపల్లికి చెందిన సల్మాఖాతూన్ అనే గర్భిణికి పురిటి నొప్పులు రాగా అంబులెన్స్‌లో మేడ్చల్ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె అంబులెన్స్‌లోనే ఆడ శిశువుకు జన్మ నిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు.

● **పరిగి:** పూర్వ విద్యార్థులు స్నేహితుడికి బాసటగా నిలిచారు. పరిగిలోని జెడ్పీహెచ్ఎస్ నం.2 2002-03 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఫోరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమ స్నేహితుడు అఫ్సర్ అనారోగ్యం, ఆర్థిక పరిస్థితులతో బాధపడుతున్నాడు. దీంతో స్నేహితులు విరాళాలు సేకరించారు.అఫ్సర్‌కు కిరాణ సామగ్రి, నగదు అందజేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, శ్రీనివాస్, మల్లేశ్, ప్రవీణ్, బిచ్చయ్య, చిన్న, వెంకటేశ్, సందీప్ పాల్గొన్నారు.

● **పరిగి:** తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్తబండిలోనే వేయాలని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య సూచించారు. తొమ్మిదో వార్డులో చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఎంజేపీ రెసిడెన్షియల్‌లో ఫుడ్, శానిటేషన్ తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ దశరథం, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **చౌడాపూర్:** మండలంలోని మందిపాల్‌లో డాక్టర్ షేక్ హమీద్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

● **తాండూరు:** తాండూరు ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం పల్లకి సేవ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. వైష్ణవి మోటర్ ఓనర్ కాశీనాథ్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అన్నదానం చేపట్టారు. ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **బంట్వారం:** పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దుర్గం చెరువు మల్లేశం అన్నారు. బస్వపూర్‌లో పార్టీ గ్రామ కమిటీ సభ్యులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కృషిచేయాలని కోరారు. అనంతరం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బొగ్గుల వెంకటేశంలను ఎన్నుకున్నారు. బల్వంత్‌రెడ్డి, నర్సిములు, బల్వంత్ రెడ్డి, శ్రీనివాస్, శివరాజ్, నరేష్, అశోక్, ఖాజపాష, రాజు, నర్సిములు, యేసప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బొట్లవనితండాలో దేశ్యా, మెగ్యత దితరులు ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేశారు.

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

మేడ్చల్ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు నాలుగు రోజుల జైలు శిక్షవిధిస్తూ మేడ్చల్ ఏడో మెట్రోపాలిటన్ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. మేడ్చల్ ట్రాఫిక్ పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఇద్దరు యువకులు మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడ్డారు. వారిని మేడ్చల్ ఏడో ఎంఎం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు.

గంజాయి చాక్లెట్ల స్వాధీనం

తాండూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో గంజాయి చాక్లెట్లతో బుధవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినేష్ అనే వ్యక్తి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డాడు. వినేష్‌ను తనిఖీ చేయగా ప్యాకెట్లలో గంజాయి చాక్లెట్లు లభించాయి. అతడుండే ఇంటికి వెళ్లి పరిశీలించగా 40గంజాయి చాక్లెట్లు దొరికాయని పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గంజాయి చాక్లెట్లు ఎక్కడి నుంచి తెచ్చాడనే విషయం విచారణ చేస్తున్నారు.